సాక్షి నల్లగొండ

సోమవారం । 12 । జూన్ । 2023



లంచావతారులు!
విద్యుత్ శాఖ అధికారులు లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోతున్నారు.
- 8లో



రంగు మారుతున్న నీరు
యాదాద్రి కొండకు దిగువన ఉన్న లక్ష్మీ పుష్కరిణిలో నీరు ఆకుపచ్చ రంగుగా మారుతోంది.
- 10లో

గరిష్ఠం/కనిష్ఠం
40°/26°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సాహితీవేత్తలకు శుభాకాంక్షలు : గుత్తా

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, రచయితలు, గాయకులకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సాహిత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు. సాహిత్య రంగంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రత్యేకతను చాటుకున్నామని తెలిపారు. దాశరథి, కాళోజీ వంటి వారికి ప్రభుత్వం విశిష్ట గౌరవాన్ని ఇచ్చిందని, వారి పేరిట అవార్డులు కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు.

తెలంగాణ వైతాళికుడు 'వట్టికోట'



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ సాహితీ రంగంలో, గ్రంథాలయ ఉద్యమంలో ఎనలేని కృషి చేసిన వట్టికోట అళ్వార్‌స్వామి తెలంగాణ వైతాళికుడిగా నిలిచిపోయారని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా అళ్వారస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేయడానికి వట్టికోట విశేష కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి బి.బాలమ్మ, సిబ్బంది కట్ట నాగయ్య, నిర్మలాదేవి, బి.శ్రీనివాస్, పాఠకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ : ఇంటర్ సప్లిమెంటరీ ఈ నెల 12వ తేదీ నుంచి 20వ తేదీవరకు ఇంటర్మీడియట్ జరగనున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు 8,321 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,362 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఒకేషనల్ విభాగంలో ఫస్టియర్ 1,025 మంది, సెకండియర్ 701 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు సంబంధించి మొత్తం 36 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి పరిధిలోని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన గావించి తులసీ దళాలతో అర్చించారు.

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

సూర్యాపేట టౌన్: ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, పాఠశాలలను తెరిచే నాటికి పుస్తకాలు, యూనిఫామ్స్ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన రేట్లతోపాటు భోజనం వంటిపెట్టే ఏజెన్సీ మహిళలకు గౌరవ వేతనం పెంచాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్, పి.శ్రీనివాసరెడ్డి, కె.అరుణ భారతి, జి.వెంకటయ్య, ఎస్.కే.సయ్యద్, బండి.పాపిరెడ్డి, ఎన్.నాగేశ్వర్ రావు, వి.రమేష్, బి.ఆడమ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

గ్రూప్–1 ప్రశాంతం

నల్లగొండ : గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నల్లగొండలో మొత్తం 51 పరీక్ష కేంద్రాల్లో 16,095 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 11,414 మంది హాజరయ్యారు. 4,681 మంది గైర్హాజరయ్యారు. గతంలో గ్రూప్–1 పరీక్ష పేపర్ లీకేజీని దృష్టిలో ఉంచుకొని పెద్దఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలకు ఇతరులను అనుమతించలేదు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు అధికారులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో వారు కన్నీటి పర్యంతమై వెనుదిరిగారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పరిశీలించారు.









ఎన్జీ కళాశాల కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు, ఆలస్యంగా వచ్చిందని కేంద్రంలోకి అనుమతించకపోవడంతో కంటతడి పెట్టిన యువతి, పోలీస్ ఎస్కార్ట్‌తో కలెక్టరేట్‌కు వచ్చిన జవాబు పత్రాలు

అటవీ భూములు కబ్జా

- దామరచర్ల పరిసర ప్రాంతంలో సుమారు 5 వేల హెక్టార్ల భూమి ఆక్రమణ
- సాగర్ పునరావాస బాధితుల భూములు సైతం వదలని ఆక్రమణదారులు
- కళ్ల ముందే కబ్జాలకు పాల్పడుతున్నా పట్టించుకోని అటవీ అధికారులు

మిర్యాలగూడ : అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రధానంగా దామరచర్ల, అడవిదేవులపల్లి, త్రిపురారం, నిడమనూరు మండలాల పరిధిలో ఈ ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 9వేల హెక్టార్ల అటవీ భూమి ఉండగా.. అందులో 5 వేల హెక్టార్లకు పైగా ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారుల అండదండలతోనే భూముల ఆక్రమణకు పాల్పడుతున్నట్లు ఈ ప్రాంతంలో ప్రజలు అంటున్నారు. భూముల ఆక్రమణ విషయంలో అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారులను కట్టడి చేయడంలో ఫారెస్ట్ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఆక్రమణల పర్వం ఇలా..

- రాజగట్టు బ్లాక్ పరిధిలో 309.91 హెక్టార్ల భూమి ఉండగా మొత్తం భూమిని నాగార్జునసాగర్ రిజర్వాయర్ పునరావాస బాధితుల కోసం కేటాయించారు. ఈ భూములకు సాగునీటి సౌకర్యం లేకపోవడంతో డీ ఫారెస్ట్ పట్టాలు ఇచ్చినప్పటికీ బాధితులు సాగు చేసుకోలేకపోతున్నారు. దీన్ని ఆసరా చేసుకుని అధికారులతో కుమ్మక్కైన కొందరు దొంగపట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. వారంతా ఇప్పుడు ఆ భూముల్లో దర్జాగా పాగా చేశారు.
- వీర్లపాలెం బ్లాక్ పరిధిలో మొత్తం 2,389.72 హెక్టార్ల భూమి ఉండగా అందులో 634 ఎకరాల భూమిని సాగర్ పునరావాస బాధితులకు మినహాయించారు. ఇక్కడ వెయ్యి హెక్టార్ల భూములను కొందరు ఆక్రమించి ప్రభుత్వ నిధులను మళ్లించి ఆ భూములను అభివృద్ధి చేసుకున్నారు.



ఫారెస్ట్ భూముల్లో నరికిన మొక్కలు (ఫైల్)

- దిలావర్‌పూర్ బ్లాక్ పరిధిలో మొత్తం 1,679.42 హెక్టార్ల అటవీ భూమి ఉండగా 55.24 హెక్టార్ల భూమిని నాగార్జునసాగర్ పునరావాస బాధితులకు మినహాయించారు. ఈ పరిధిలో మొత్తం 200 హెక్టార్ల భూమి ఆక్రమణకు గురైంది. ఈ బ్లాక్ పరిధిలో విస్తరించిన అడవుల్లో కిలోమీటర్ల పొడవునా రహదారి నిర్మించుకున్నా.. ఆ దారి అధికారులకు కనిపించకపోవడం విస్మయం కలిగిస్తోంది.
- నిడమనూరు మండలంలోని ముల్కచర్ల బ్లాక్ పరిధిలో 2726.26 హెక్టార్ల భూమి ఉండగా 724.10 హెక్టార్ల భూమిని సాగర్ ముంపు బాధితులకు కేటాయించారు. కొంతమంది అక్రమ పట్టాలు సృష్టించి అటవీ భూములను పెద్ద ఎత్తున ఆక్రమించుకుని ఎలాంటి అనుమతులు లేకుండానే రహదారులు ఏర్పాటు చేసుకున్నారు.
- త్రిపురారం మండంలోని గంగాదేవిగట్టులో 264.87హెక్టార్ల భూమి, రాగడప బ్లాక్‌లో 30.35 హెక్టార్లు, దామరచర్ల మండలంలోని కల్లేపల్లిలో 59.03 హెక్టార్లు, అడవిదేవులపల్లిలో 900.04 హెక్టార్ల అటవీ భూమి ఉంది. అడవిదేవులపల్లి బ్లాక్‌లో సుమారు 600 హెక్టార్ల భూమి ఇతరుల కబ్జాలో ఉంది. ఈ భూములను నాయకులు, ప్రజాప్రతినిధులు ఆక్రమించుకుని వరి పంట, బత్తాయి తోటలు సాగు చేస్తున్నప్పటికీ అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అటవీ భూములు ఆక్రమిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తాం



అటవీ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. అటవీ చట్టం ప్రకారం వారికి భారీ జరిమానా విధిస్తాం. అవసరం అనుకుంటే పీడీయాక్ట్ కూడా నమోదు చేస్తాం. గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 250 మందిపై 120 కేసులు నమోదు చేసి రూ.5 లక్షల జరిమానా విధించాం. అటవీ భూముల పర్యవేక్షణ కోసం గస్తీ నిర్వహిస్తున్నాం. క్రైట్ పెట్రోలింగ్‌లో ఇద్దరు బీట్ ఆఫీసర్లు, ఒక సెక్షన్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్‌తో వారానికి రెండు సార్లు గస్తీ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే బుల్డోజర్లు, ప్రొక్లెయినర్ల యజమానులకు నోటీసులు ఇచ్చాం. అటవీ భూముల ఆక్రమణకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని ఫారెస్ట్ పరిధిలోని సర్పంచ్‌లకు లేఖలను సైతం పంపించాం.

– ఆనంద్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, మిర్యాలగూడ

తప్పుడు పత్రాలు సృష్టించి..

దామరచర్ల మండలంలోని వజీరాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ పరిధిలో మొత్తం 855.69 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ భూమి ఉండగా 119.38 హెక్టార్లను నాగార్జునసాగర్ ప్రాజెక్టు పునరావాస బాధితులకు మినహాయించారు. మరో 100 హెక్టార్ల భూమిని ఓ సిమెంట్ పరిశ్రమకు కేటాయించారు. పునరావాస కేంద్రానికి కేటాయించిన భూమిని ఇటీవల కొందరు కబ్జా చేసేందుకు ప్రణాళికలు రచించారు. తప్పుడు పత్రాలను సృష్టించి పోడు భూముల కింద నమోదు చేసుకునేందుకు ఫారెస్ట్ అధికారులు నాటిన మొక్కలను సైతం నరికివేశారు. దీనిపై ఫారెస్ట్ అధికారులు వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఈ బ్లాక్ పరిధిలోని అటవీ భూముల్లో ఉన్న డీ ఫారెస్ట్ పట్టాలను మార్పిడి చేసుకుని రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు ఇప్పటికే పాస్ పుస్తకాలు సైతం పొందారు.

సాహిత్యంతోనే సమాజ చైతన్యం

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : సాహిత్యంతోనే సమాజం చైతన్యవంతం అవుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవం సందర్భంగా నల్లగొండలో నిర్వహించిన కవి సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ పరిస్థితులను బట్టి ఉద్యమాలను జ్వలింప చేయడానికి, ప్రజలను రంజింప చేయడానికి సాహిత్యం ఉపయోగపడుతుందన్నారు. ఉద్యమాల్లో సాహిత్యం ప్రజలను చైతన్యవంతులను చేసిందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కవులు, సాహితీవేత్తలకు నిలయమన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రశంస పత్రం, జ్ఞాపిక, నగదుతో సత్కరించారు. ముందుగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్‌కుమార్, రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ కుష్బూ గుప్తా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పంకజ్ యాదవ్, ట్రైకార్ చైర్మన్ రాంచంద్రనాయక్, డీఈఓ భిక్షపతి, డీపీఆర్‌ఓ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



స్వాగత నృత్యం చేస్తున్న చిన్నారులు

ఈత కొట్టేవారితో ముచ్చట

నల్లగొండలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డికి.. పానగల్ వద్ద రిజర్వాయర్ వద్ద పట్టణవాసులు ఈత కొడుతూ కనిపించారు. వెంటనే అక్కడ ఆగిన మంత్రి అక్కడి వారితో ముచ్చటించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు అనుకూలంగా చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మంత్రితో సెల్ఫీలు దిగేందుకు యువత పోటీ పడింది.



మంత్రిలో సెల్ఫీ దిగుతున్న యువకుడు



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

ప్రజలను పలకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..



కొండమల్లేపల్లి మండలంలో సాగుతున్న భట్టి విక్రమార్క పాదయాత్ర

- కొండమల్లేపల్లి మండలంలో సాగిన భట్టి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర
- గుమ్మడవెల్లి వద్ద ఎంపీ కోమటిరెడ్డితో కలిసి పైలాన్ ఆవిష్కరించిన విక్రమార్క

కొండమల్లేపల్లి : సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ హామీలతో భరోసా కల్పిస్తూ ముందుకుసాగారు. ఆదివారం కొండమల్లేపల్లి మండలంలోని కొల్ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ నుంచి ఆయన పాదయాత్ర కొనసాగింది. ఈ క్రమంలోనే బాపూజీనగర్‌లో నివాసముంటున్న వరుసు సుగుణమ్మ, వెంకటయ్య దంపతులను పలకరించిన భట్టి వారితో కాసేపు మాట్లాడారు. తమకు ఇల్లు లేదని, కవర్లతో నిర్మించుకున్న ఇంటిలో కాలం వెళ్లదీస్తున్నామని, తమ కుమారుడు డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం లేదని భట్టితో ఆ దంపతులు తమ ఆవేదన చెప్పుకున్నారు. బాపూజీనగర్‌లో మరో మహిళ వెంకటమ్మ తన భర్త, కుమారుడు మరణించారని.. ఇల్లు కూడా లేదని.. ఎలాంటి ఆధారం లేని తనను ఆదుకోవాలని స్థానిక నాయకులకు ఎన్ని సార్లు చెప్పుకున్నా ఎవరూ పట్టించుకోవడం భట్టికి తన కష్టాన్ని చెప్పుకుంది. ఈ క్రమంలోనే భట్టి మాట్లాడుతూ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు మీకు వర్తింపజేస్తామని హామీనిచ్చారు. అనంతరం పాదయాత్ర కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. కొండమల్లేపల్లిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క.. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బలహీన వర్గాలకు గొర్రె పిల్లలు ఇస్తే.. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో యాదవులకు రాజ్యాధికారం ఇచ్చిందని చెప్పారు. భట్టి విక్రమార్క పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే బాలునాయక్, నాయకులు నేనావత్ కిషన్‌నాయక్, బిల్యానాయక్, జగన్‌లాల్‌నాయక్, మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, దూదిపాల వేణుధర్ రెడ్డి, నర్సింహారెడ్డి, ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గుమ్మడవెల్లి వద్ద భట్టిని సన్మానిస్తున్న ఎంపీ వెంకటరెడ్డి

బయటపడ్డ విభేదాలు..

పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా కొండమల్లేపల్లిలో కార్నర్ మీటింగ్‌లో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతున్న సమయంలో నాయకుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. బాలునాయక్ చేతిలో నుంచి మైక్‌ను కిషన్‌నాయక్ లాగేసుకున్నారు. దీంతో భట్టి కొంత అసహనం వ్యక్తం చేశారు.

బడికి వేళాయే..

- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- సిద్ధమైన ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు
- ప్రభుత్వ విద్యార్థులకు 20వ తేదీన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ

నల్లగొండ : నేటి నుంచి బడి గంట మోగనుంది. వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపిన బాల్యం బడిబాట పట్టనుంది. పునః ప్రారంభానికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరిస్తూ బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలంటూ అంగన్‌వాడీలు, తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా బోధన చేస్తామని వారికి ధీమా కల్పించి పాఠశాలలో చేర్పించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు బోధన ప్రారంభించారు.



కనగల్ మండలంలోని బుడమర్లపల్లి పాఠశాల

ఈసారి ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు..

ప్రభుత్వం ఈ ఏడాది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందించనుంది. ఈనెల 20న విద్యా దినోత్సవం సందర్భంగా వాటిని పంపిణీ చేయనున్నారు. ట్యాబ్‌ల ద్వారానే విద్యార్థుల హాజరు నమోదు చేయడంతోపాటు పాఠ్యాంశాలకు సంబంధించిన వాటిని కూడా ట్యాబ్‌ల ద్వారానే బోధించనున్నారు. తద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉదాహరణలు చూపుతూ బోధించడం సులభంగా అర్థం చేసుకుంటారన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం.

తగ్గని ఎండలు..

జూన్ రెండో వారం వచ్చినా ఎండల తీవ్రత తగ్గలేదు. 40 డిగ్రీల పైచిలుకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రెండు రోజుల నుంచి ఎండ ఎక్కువగా ఉంటోంది. వడ గాలులు వీస్తున్నాయి. ఈ పరిస్థితిలో విద్యార్థులు స్కూళ్లలో ఇబ్బంది పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

20వ తేదీన యూనిఫాం, పుస్తకాల పంపిణీ..

12న పాఠశాలలు ప్రారంభం అవుతున్నా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మాత్రం ఈ నెల 20వ తేదీన అందజేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు 92 శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వాటిని మండల పాయింట్లకు కూడా పంపారు. 70 శాతం వరకు యూనిఫాం స్టిచ్చింగ్ పూర్తయింది. వీటిని తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కిలో చికెన్ రూ.320



చిట్యాల : చికెన్ ధర రికార్డు స్థాయికి చేరింది. సాధారణంగా వేసవి కాలంలో చికెన్ ధరలు పెరుగుతుంటాయి. ఈ ఏడాది పగటిపూట అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో కోళ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో వారం రోజులుగా చికెన్ రేట్లు పెరుగుతున్నాయి. ఆదివారం లైవ్ బర్డ్ ధర రూ.190 ఉండగా.. డ్రెస్డ్ స్కిన్‌తో రూ.280, స్కిన్‌లెస్ చికెన్ రూ.320 చేరుకుంది. పదిహేను రోజులుగా వివాహాది శుభకార్యక్రమాలు ఉండడం, మార్కెట్ అవసరాల మేరకు కోళ్ల ఉత్పత్తి లేకపోవడంతో చికెన్ ధరలు పెరుగుతూపోతున్నాయి. మృగశిర కార్తె వచ్చి ఐదు రోజులు దాటినప్పటికీ వర్షపు జాడ లేదు. ఎండ దాటికి ఫౌల్ట్రీ ఫాంలలో కోళ్ల ఉత్పత్తి తగ్గిపోతోంది. చికెన్ రేటు పెరుగుతుండడంతో కొనుగోలు చేయలేకపోతున్నామని మాంసం ప్రియులు పేర్కొంటున్నారు.

అస్తవ్యస్తంగా ఎడమకాల్వ కట్టలు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వ కట్టలు అస్తవ్యస్తంగా మారాయని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలంలోని అన్నపురెడ్డిగూడెం, ఐలాపురం గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న సాగర్ ఎడమకాల్వలో నడిచి, లిఫ్టులను పరిశీలించి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకరంగా ఉన్న యాద్గార్‌పల్లి మేజర్‌కాల్వ కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలో ఎడమకాల్వ ఆయకట్టు లైనింగ్ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కాల్వ ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదని కాల్వ మధ్యలో లైనింగ్ పనులు వదిలేసారని అన్నారు. ఐలాపురం, అన్నపరెడ్డిగూడెం మధ్యలో సుమారు 3.5 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో కాల్వ కట్ట బలహీనంగా మారిందని.. సాగు నీరు విడుదల చేసే సమయంలో కట్ట కోతకు గురై గండ్లు పడే ప్రమాదం పొంచి ఉందన్నారు. కాల్వ కట్ట లైనింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మన లిఫ్టులను మనమే నిర్మించుకుందామని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు లిఫ్టులను పట్టించుకోవడం లేదన్నారు. ఎల్–11, 12, 13, 14లలో తూములను కిందకు దించాలన్నారు. లిఫ్టుల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మంగారెడ్డి, గౌతంరెడ్డి, పాదూరి గోవర్ధని, రాంరెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్, గోవింద్‌రెడ్డి, వెంకన్న, మల్లయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



ఎడమకాల్వ కట్టలను పరిశీలిస్తున్న రంగారెడ్డి

క్లుప్తంగా

గోవుల పట్టివేత



పట్టుబడిన గోవుల వాహనం

చింతపల్లి : హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ఆదివారం భజరంగ్‌దళ్ కార్యకర్తలు గోవులతో వెళ్తున్న వాహనాన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లేపల్లిలో రైతుల నుంచి కొనుగోలు చేసిన గోవులను టాటా ఏస్ వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చింతపల్లి సాయిబాబా దేవాలయం వద్ద భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. అనంతరం వాహనాన్ని పోలీసులకు అప్పజెప్పారు. అందులోని ఏడు గోవులను నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ గోశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



గాయపడిన మధుసూదన్‌రెడ్డి, వెంకన్న

అర్వపల్లి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. తిమ్మాపురం గ్రామానికి చెందిన పటేల్ మధుసూదన్‌రెడ్డి బైక్‌పై సూర్యాపేట మండలం బాలెంలకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో తిమ్మాపురం శివారులోని బంక్‌లో పెట్రోల్ పోసుకోవడానికి క్రాస్ అవుతుండగా తిరుమలగిరి నుంచి సూర్యాపేటకు వెళ్తున్న వెంకన్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

కారు, ఆటో ఢీకొని..

మోతె : అతివేగంతో ప్రయాణిస్తున్న కారు ఎదురుగా ట్రాలీ ఆటోను ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోతె మండల పరిధిలోని హుస్సేన్‌బాద్ గ్రామ శివారు సూర్యాపేట–ఖమ్మం 365 బీబీ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకొంది. సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఆటోను హుస్సేన్‌బాద్ గ్రామ శివారులో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటో బోల్తా కొట్టడంతో అందులోని డ్రైవర్‌కు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

లంచావతారులు !

- లంచాలు తీసుకుంటూ ఏసీబీకి అడ్డంగా దొరికిపోతున్న విద్యుత్ ఉద్యోగులు
- తాజాగా సబ్ ఇంజనీర్ రూ. 10వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- అధికారుల తీరుతో అపవాదును మూటగట్టుకుంటున్న విద్యుత్ శాఖ



నల్లగొండ : విద్యుత్ శాఖ అవినీతికి కేరాఫ్‌గా మారిందనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అందుకు ఆ శాఖ అధికారులు లంచాలు తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు అడ్డంగా దొరికిపోతున్న కేసులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. గడిచిన ఆరేడేండ్లలో ఉమ్మడి జిల్లాలో దాదాపు పది మంది ఆ శాఖ ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడిన తీరు విస్మయపరుస్తోంది.

ఏసీబీకి పట్టుబడిన అధికారులు వీరే..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గతంలో నల్లగొండ ఎస్‌ఈగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఐదేళ్ల క్రితం నల్లగొండ డీఈగా పనిచేసిన అశోక్ కూడా లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయాడు. అదే విధంగా హుజూర్‌నగర్‌లో డీఈగా పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి , భువనగిరి డీఈగా పనిచేసిన దుర్గారావు, వేములపల్లి ఏఈ శ్రీధర్‌రెడ్డి, మేళ్లచెరువు ఏఈ గోవిందరాజులతోపాటు 14నెలల క్రితం మిర్యాలగూడ డీఈ మురళీధర్‌రెడ్డి, జేఏఓ దామోదర్, సీనియర్ అసిస్టెంట్ లతీఫ్‌లు కూడా లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. తాజాగా గురువారం నల్లగొండ డీఈ కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి సబ్ ఇంజనీర్ వెంకట్‌రెడ్డి రూ.10వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు నేరుగా పట్టుబడ్డాడు. డీఈ శంకరయ్య లంచం తీసుకోమనడంతోనే సబ్ ఇంజనీర్ వెంకట్‌రెడ్డి తీసుకున్నాడన్న ఆధారాలతో డీఈపై కూడా కేసు నమోదు చేశారు. ఆయనను ఏ 1గా కేసులో పేర్కొన్న పరిస్థితి. ఒక్క మిర్యాలగూడలో పట్టుబడిన మురళీధర్‌రెడ్డి కేసు తప్ప మిగిలిన అన్ని కేసుల్లో కూడా కాంట్రాక్టర్లే అధికారులకు లంచాలు ఇస్తూ ఏసీబీ అధికారులకు పట్టించారు.

అధిక జీతాలు, లంచాలు విద్యుత్ శాఖలోనే..

అన్ని శాఖల ఉద్యోగుల కంటే విద్యుత్ శాఖలోనే వేతనాలు అధికంగా ఉంటాయి. కానీ, ఈ శాఖలోనే లంచాలు కూడా అధికంగానే ఉంటాయనేది ప్రతియేటా నమోదవుతున్న ఏసీబీ కేసులను పరిశీలిస్తే అర్థమవుతుంది. జిల్లాలో ఏ ఇతర శాఖల్లో ఇంత పెద్ద ఎత్తున లంచాలు తీసుకుంటూ పట్టుబడింది లేదు. ఎస్‌ఈ స్థాయి మొదలుకొని, డీఈ, ఏఈ, జూనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు కూడా లంచాలు తీసుకున్న విషయంలో ఏసీబీ కేసుల్లో ఇరుక్కుపోయారు. అధిక వేతనాలు ఉన్నప్పటికీ లంచాలు వసూలు చేయడంలోనూ అగ్రభాగాన ఉండడంతో ఆ శాఖ అప్రతిష్ఠపాలవుతోంది.

అత్యాశతోనే కేసుల పాలు

విద్యుత్ శాఖలో వేతనాలు అధికంగా ఉన్నప్పటికీ అత్యాశతో లంచాలు డిమాండ్ చేయడం, ఏసీబీ అధికారులకు పట్టుబడటం సర్వ సాధారణమైంది. చాలా చోట్ల అధికంగా డబ్బులు డిమాండ్ చేయడం ,అగ్రిమెంట్లు, బిల్లులు, ఎస్టిమేట్ల తయారీలో తిప్పుకోవడంతో విసుగు చెందిన కొందరు కాంట్రాక్టర్లు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తుండగా మరి కొందరు కాంట్రాక్టర్లను ఇబ్బంది పడే విధంగా మాట్లాడటంతో విసుగు చెంది పట్టించిన పరిస్థితి. మరి కొందరు అయితే ఏళ్ల తరబడి కాంట్రాక్టర్లు చేస్తున్న వారికి కాంట్రాక్టు ఇవ్వకుండా ఒక్కరికే అధికంగా ఇవ్వడం, ఇచ్చిన పనుల్లో కూడా ఇబ్బందులకు గురి చేయడం వల్ల కూడా కొందరు ఏసీబీ అధికారులకు పట్టించారన్న ప్రచారం ఉంది.

మార్పు ఏదీ?

ప్రతి సంవత్సరం ఏదో ఒక చోట విద్యుత్ శాఖలో లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్న పరిస్థితి. జిల్లాలో ఒక్క విద్యుత్ శాఖలోనే ఏటా ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నప్పటికీ ఆ శాఖ అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. పట్టుకున్న రెండు మూడు నెలలు ఆ శాఖలో భయంభయంగా ఉంటారు. ఆ తర్వాత అంతా మామూలే. దీంతో ఆ శాఖలోనే అధికంగా లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కుతున్నారు. మార్పు మాత్రం రావడం లేదు.

అనాథాశ్రమం ఏర్పాటు అభినందనీయం



సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకలో అనాథాశ్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి
- పుట్టపాకలో యాదాద్రి అనాథాశ్రమం ప్రారంభం

సంస్థాన్ నారాయణపురం : మానవీయ కోణంలో అనాథాశ్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక ఉపసర్పంచ్ వర్కాల చంద్రశేఖర్ ఆయన సోదరులు శ్రీనివాస్, యాదగిరిల జ్ఞాపకార్థం గ్రామంలో ఏర్పాటు చేసిన యాదాద్రి అనాథాశ్రమాన్ని మంత్రి ఆదివారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి ప్రభుత్వం నుంచి ఎంత చేసినా ఎంతో కొంత స్వచ్ఛంద సంస్థల అవసరం ఉంటుందన్నారు. మానవీయ కోణంలో ఆలోచించే దృక్పథం ఉన్న వ్యక్తులకే స్వచ్ఛంద సంస్థల స్థాపన సాధ్యమన్నారు. దురదృష్టం, ప్రమాదవశాత్తు అనాథలు, దివ్యాంగులు, పుట్టుకతో మానసిక వికలాంగులుగా మారిన వారిని కుటుంబ సభ్యులే భారంగా భావించి వదిలేస్తున్నారని అన్నారు. ఇలాంటి వారిని స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలన్నారు. ఈ సంస్థలకు ప్రభుత్వం నుంచి కూడా సహకారం ఉంటుందన్నారు. సమాజ అసరాలని అర్థం చేసుకొని ఆశ్రమం ఏర్పాటుకి ముందుకు రావడం గొప్ప నిర్ణయమని, చివరి వరకు దాన్ని కొనసాగించాలని కోరారు. ఆదుకోవాలని ఆలోచన చాలామందికి ఉన్నా ఆచరణలో అందరికీ సాధ్యం కాదన్నారు. ఆశ్రమానికి భవిష్యత్తులో తన సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్త ఉమాదేవి, జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, వైస్ ఎంపీపీ రాజు, ఎంపీటీసీ మర్రి వసంత, సర్పంచ్ సామల భాస్కర్, జర్నలిస్ట్ మర్రి మహేందర్‌రెడ్డి, గుజ్జ సహకార బ్యాంక్ చైర్మన్ దొడ యాదిరెడ్డి, వైస్ చైర్మన్ బ్రహ్మచారి, దొంతగాని పెద్దులు, పిట్ట రాములు, సుక్క గాలయ్య, ఐతరాజు గాలయ్య, యాదవరెడ్డి, పానుగుల శంకర్, కొత్త శ్రీకాంత్, పిట్ట రామచంద్రం, దొంతగాని అమరేందర్, రాఘవచారి, బొల్ల శివశంకర్, ఇడం కైలాసం తదితరులున్నారు.

ఫొటో స్టూడియోలో చోరీ

హాలియా : గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఫొటో స్టూడియోలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన అనుముల మండలంలోని రామడుగు గ్రామంలో ఆదివారం వెలుగుచూసింది. రామడుగు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి వినోద్ అదే గ్రామంలోని కనగల్ రోడ్డు వెంట ఉన్న సొంత షటర్‌లో మేఘన డిజిటల్ ఫొటో స్టూడియో, కిరాణం షాపు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి 8గంటల వరకు ఫొటో స్టూడియో, కిరాణం షాపు నడిపి అనంతరం షటర్‌కు తాళం వేసి వెనుకాల ఉన్న ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి దుండగులు కారులో వచ్చి ఫొటో స్టూడియో షటర్ తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. షాపులో ఉన్న రూ.2.50లక్షల విలువైన కెమెరాతో పాటు రూ.5వేల నగదు, 20 లీటర్ల డీజిల్ క్యాన్‌ను అపహరించుకుపోయారు. సమీపంలో నివాసం ఉన్న దుండెటి రాంరెడ్డి మూత్ర విసర్జనకు బయటికి రాగా ఫొటో స్టూడియో ముందు కారు ఆగి ఉండటాన్ని గమనించి వినోద్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో వినోద్ ఇంటి నుంచి బయటకు వచ్చి చూడగా కారు ఉండటాన్ని గమనించి దానిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు అతడి అడ్డు తొలగించుకొని కారులో పారిపోయారు. జరిగిన ఘటనపై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతి కుమార్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో డబ్బాకొట్టు దగ్ధం

హుజూర్‌నగర్: అగ్ని ప్రమాదంలో డబ్బాకొట్టు దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎస్‌బీఐ వీధిలో మధ్యాహ్నం సమయంలో గుర్తుతెలియని వ్యక్తి నిప్పు వేయడంతో అక్కడ ఉన్న చెత్తకు అంటుకుని మంటలు లేచాయి. మంటలు క్రమంగా వ్యాపించి డబ్బాకొట్టుకు అంటుకోవడంతో అగ్నికి ఆహుతైంది. మంటలు బ్యాంక్ వైపు వ్యాపిస్తుండడంతో స్థానికులు, మున్సిపల్, బ్యాంక్ సిబ్బంది గమనించి ఆర్పివేశారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి



ఆదర్శ వివాహం చేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సమాజంలో కులాలకు మతాలకు అతీతంగా ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేతేపల్లి మండలం కాసనగోడు గ్రామ ముదిరాజ్ కులానికి చెందిన నవీన్, ఉపేంద్రల ఆదర్శ వివాహాన్ని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ సంప్రదాయాలు కట్టుబాట్ల పేరుతో జరుగుతున్న పెళ్లిళ్ల కన్నా ఆదర్శ వివాహాలు గొప్పవన్నారు. ఆదర్శ వివాహాలు జరిగితేనే వరకట్నం పేరుతో జరుగుతున్న దురాచారాలను అరికట్టవచ్చన్నారు. సమసమాజ స్థాపన జరగాలంటే కులాంతర, మతాంతర, ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, సీపీఎం జిల్లా నాయకులు చినపంగు నరసయ్య, నాయకులు ఎల్లయ్య, స్వామి, సైదులు, చిరంజీవి, అంతటి నాగేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన 'రీజినల్' బాధితులు



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

భువనగిరి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు కలిశారు. మంత్రికి వినతి పత్రం అందజేసి రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో తమకు జరిగే నష్టాన్ని వివరించారు. రింగ్ రోడ్డు నిర్మాణం కోసం భూ సేకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంటుందని, రాష్ట్రం ఒప్పుకుంటే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు రైతులు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఆవుశెట్టి పాండు, ఎలిమినేటి మధుసూదన్‌రెడ్డి, నీరజ్‌రాయ్, భిక్షపతి, అనిల్, అర్జున్‌రెడ్డి, జగన్‌రెడ్డి, రమేష్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

రామన్నపేట : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. రామన్నపేట, తుర్కపల్లి, ఆలేరు మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన మునుకుంట దుర్గమ్మ(55) జీవనోపాధి నిమిత్తం చిట్యాల మండల కేంద్రంలో నివాసం ఉంటోంది. సొంత పనుల నిమిత్తం ఆదివారం లింగరాజుపల్లి గ్రామానికి వెళ్లింది. పనులు ముగించుకొని అదేరోజు సాయంత్రం ఉరుమడ్ల గ్రామానికి చెందిన బైరు వెంకన్న ద్విచక్ర వాహనంపై చిట్యాలకు బయలుదేరింది. మార్గమధ్యలో ఇంద్రపాలనగరం అంబేడ్కర్ చౌరస్తా వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో దుర్గమ్మ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్‌ఐ లక్ష్మయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని కారు ఢీకొని..



సత్యనారాయణ (ఫైల్)

తుర్కపల్లి: తుర్కపల్లి మండలం మాధాపూర్ గ్రామానికి చెందిన అన్నారం సత్యనారాయణ (52) వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి హాజరయ్యేందుకు బైక్‌పై తుర్కపల్లి మండల కేంద్రానికి వచ్చాడు. అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో మల్కాపూర్ గ్రామ శివారులో వెనుకనుంచి గుర్తుతెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను స్థానికులు హైదరాబాద్‌కు తరలించగా అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య వరమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ తెలియలేదు. సంఘటన స్థలాన్ని ఏఎస్‌ఐ మైసయ్య పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీని ఢీకొట్టి.. రెండు కిలో మీటర్లు ఈడ్చుకెళ్లి..

- ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన స్కూటీ

ఆలేరురూరల్ : హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టడంతో ఓ మహిళ మృతిచెందగా ఆమె భర్తకు గాయాలయ్యాయి. ఆలేరులో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరులోని డయాలసిస్ కేంద్రంలో ఉద్యోగిగా పనిచేస్తున్న కన్నయ్య తన భార్య శ్రావణి(23)తో కలిసి ఆదివారం రాత్రి స్కూటీపై భువనగిరి వైపు వెళ్తున్నాడు. బహదూర్‌పేట బ్రిడ్జి సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన కారు వీరి స్కూటీని బలంగా ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరూ ఎగిరి రోడ్డుపై పడడంతో గాయపడ్డారు. అనంతరం కారు వీరి స్కూటీని సుమారు రెండు కిలోమీటర్ల వరకు ఈడ్చుకెళ్లింది. స్థానికులు తీవ్రంగా గాయపడిన శ్రావణిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి, కన్నయ్యను ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రావణి అదేరోజు రాత్రి మృతిచెందింది. కన్నయ్య, శ్రావణిలకు రెండు నెలల క్రితమే వివాహమైనట్లు తెలిసింది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట శ్రీను తెలిపారు.

ఆర్మీ లెఫ్టినెంట్ కమాండర్ భార్య ఆత్మహత్య

- మానసిక ఇబ్బందులతోనే అఘాయిత్యం

తుర్కపల్లి: ఉరేసుకుని ఆర్మీ లెఫ్టినెంట్ కమాండర్ భార్య ఆత్మహత్య చేసుకుంది. తుర్కపల్లి మండలం మాధాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మాధాపూర్ గ్రామానికి చెందిన మిర్యాల గణేశ్ ఆర్మీలో లెఫ్టినెంట్ కమాండర్‌గా గుజరాత్‌లో పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య మహేశ్వరి (35), కుమారుడు జశ్వంత్, తల్లి పోషమ్మ ఉన్నారు. గణేశ్ నెలరోజుల పాటు కుటుంబ సభ్యులతో సెలవులు గడిపి పది రోజుల క్రితమే విధుల్లో చేరేందుకు గుజరాత్ వెళ్లాడు. ఈయన తల్లి పోషమ్మ కూడా ఇటీవల సైనిక్‌పూర్‌లో ఉంటున్న పెద్ద కుమారుడి ఇంటికి వెళ్లింది. మహేశ్వరి కుమారుడితో కలిసి మాధాపూర్‌లో ఉంటుంది. ఆదివారం సంత జరుగుతుండడంతో కుమారుడు కూరగాయలు తెచ్చేందుకు వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న మహేశ్వరి కుమారుడు వచ్చే సరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మహేశ్వరికి కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేక చికిత్స పొందుతోంది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మానసిక సమస్యలను తట్టుకోలేకనే తన తల్లి ఆత్మహత్య చేసుకుందని జశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మైసయ్య తెలిపారు.

బంధుత్వాలకు సమయం ఇవ్వడం లేదు



కస్తూరి వంశవృక్షం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కస్తూరి వంశస్తులు

యాదగిరిగుట్ట: ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో బంధాలు, బంధుత్వాలకు సమయం సమయం ఇవ్వలేని స్థితిలో మనిషి ఉన్నాడని కస్తూరి హాస్పిటల్స్ ఎండీ కస్తూరి లక్ష్మీ నారాయణ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం కస్తూరి కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరి వంశవృక్షం పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే తరాల పిల్లలకు తమ కుటుంబ సభ్యులు ఎవరు, తాతలు, ముత్తాతలు ఎవరో తెలియకుండా పోతుందనే భయం వేస్తుందన్నారు. వివిధ ప్రాంతాల్లో ఎంత పెద్ద స్థాయిలో స్థిరపడినా.. బంధువులు, బంధాలు, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులంతా ఒకే చోటా కలిస్తే ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కస్తూరి రాందాస్, వీరనారాయణ, రాజారాం, కిష్టయ్య, సుదర్శన్, భిక్షపతి, రామాంజనేయ, విమల బలరాం తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి ఎమ్మెల్యే టికెట్ నాకే ఇవ్వాలి

- రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ మందుల సామేల్



మాట్లాడుతున్న రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ మందుల సామేల్

అడ్డగూడూరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే టికెట్‌ను స్థానికుడినైన తనకే కేటాయించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ మందుల సామేల్ డిమాండ్ చేశారు. అడ్డగూడూరు మండలంలోని గట్టుసింగారం గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 22 ఏళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడ్డానని, తుంగతుర్తి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడానికి ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని నిలబడ్డానని పేర్కొన్నారు. తాను గతంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నప్పుడు దాదాపు రూ.20కోట్లతో చౌల్లరామారం గ్రామంలో 15వేల మెట్రిక్ టన్నుల గోదాములను నిర్మించామని, సీఎస్‌ఆర్ నిధులతో తన సొంత గ్రామమైన ధర్మారం నుంచి గట్టుసింగారం వరకు రోడ్డు, ధర్మారం గ్రామం నుంచి కోటమర్తి గ్రామాల మధ్య లింక్ రోడ్డు నిర్మింపజేశానని తెలిపారు. 2014లో సీఎం కేసీఆర్, 2018లో మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు తుంగతుర్తి ఎమ్మెల్యే టికెట్‌ను వదులుకున్నానని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ క్రిష్టయ్య, కురాకుల యాదగిరి, లాదినేని నాగయ్య, ఏర్వ ఇన్నారెడ్డి, బాల్‌రెడ్డి, లూర్దిరెడ్డి, జోసఫ్‌రెడ్డి, లక్ష్మినర్సు, సోమయ్య, ఈదుల బాబు, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'కొండ'పై భక్తుల మధ్య ఘర్షణ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తుల మధ్య ఘర్షణ నెలకొంది. ఈ ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక భక్తులు, ఎస్‌పీఎఫ్, హోంగార్డు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రెండు కుటుంబాలకు చెందిన సుమారు 20మంది భక్తులు శనివారం రాత్రి యాదాద్రీశుడి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం రాత్రి 9.30గంటల తర్వాత కిందికి దిగేందుకు కొండపైన ఉన్న బస్టాండ్ వద్దకు వెళ్లారు. భక్తులు బస్సు ఎక్కడానికి పోటీపడ్డారు. ఆ సమయంలో మహిళా భక్తుల మధ్య తోపులాట జరిగి, వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఇరు కుటుంబాలకు చెందిన భక్తుల మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో ఓ భక్తురాలి తలకు గాయమైనట్లు తెలిసింది. ఈ సమయంలో అక్కడికి చేరుకున్న ఎస్‌పీఎఫ్, హోంగార్డు సిబ్బంది ఇరువర్గాలను సముదాయించి, వేర్వేరు బస్సుల్లో పంపించారు.

పత్తి సాగులో పాటించాల్సిన మెళకువలు

- యాదాద్రి భువనగిరి జిల్లా ఏరువాక శాస్త్రవేత్త మధుశేఖర్ సలహాలు



మధుశేఖర్



ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లాలో వరి తర్వాత అత్యధికంగా సాగు చేస్తున్న పంట పత్తి. ముఖ్యంగా వలిగొండ, ఆత్మకూరు (ఎం), మోటకొండూరు, అడ్డగూడూరు, గుండాల తదితర మండలాల్లో పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. పత్తి సాగులో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించినట్లయితే అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. విత్తనం ఎంపిక నుంచి మొక్క పెరిగి పత్తి దిగుబడి వచ్చు వరకు పాటించాల్సిన పద్ధతుల గురించి యాదాద్రి భువనగిరి జిల్లా ఏరువాక శాస్త్రవేత మధుశేఖర్ సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

» పత్తి విత్తడానికి జూన్ నుంచి జూలై 20 వరకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఎత్తుమల్లు, బోదసాలు పద్ధతి వల్ల విత్తినట్లయితే అధిక వర్షానికి నిలదొక్కుకుంటుంది.

పాడి పంట

» ఇమిడోక్లోరోఫైడ్ లేదా క్లోరినెన్స్ లేదా ట్రైకోడర్మోతో విత్తన శుద్ధి చేసిన విత్తనాలను విత్తుకోవాలి.

» పత్తిలో అంతరపంటలుగా పెసర, సోయాచిక్కుడు, మినుము అంతరపంటలుగా వేసుకోవాలి.

» నల్లరేగడి భూములు పత్తి సాగుకు అనుకూలం, తేలిక పాటి భూములు అనుకూలంగా ఉండవు.

» భూమి స్వభావాన్ని బట్టి అచ్చులు మార్చుకొని మొక్కల సంఖ్యను పెంచుకోవాలి.

» 60,75 ఎంఎం వర్షం నమోదు అయితేనే పత్తి విత్తనాలను నాటు కోవాలి.

» పత్తిపై వచ్చు గులాబీ రంగు తెగులు సమస్యను తగ్గించుకోవడానికి ఒకే ప్రాంతంలోని రైతులు ఒకే సారి విత్తుకోవాలి.

» ఎకరానికి 200కిలో వేప పిండిని రెండు లేదా మూడు సంవత్సరాలలోకో మారు భూమిలో వేసుకోవాలి. దీంతో భూమి నుంచి ఆశించు తెగుళ్లను నివారించవచ్చు.

» సంచుల్లో వచ్చిన విత్తనాలను కాకుండా సీల్ చేసిన ప్యాకెట్ విత్తనాలను కొనుగోలు చేయాలి. డీలర్ నుంచి విత్తనాలను కొనుగోలు చేసిన రశీదును తీసుకోవాలి.

» గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి దిగుబడులు వచ్చిన పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలి.

» 60 నుంచి 75 ఎంఎం వర్షాపాతం నమోదు అయినట్లయితేనే పత్తి విత్తనాలను విత్తుకోవాలి. ఈ సలహాలు, సూచనలు పాటిస్తే పత్తి అధిక దిగుబడి వస్తుంది.